# కాంగ్రెస్ సర్కారుకు తానా తందానా!

**ఇష్యూ ఏదైనా రేవంత్‌కు వంత పాడుతున్న బీజేపీ ఎంపీ!**

- ఆయన వ్యవహార శైలిపై సొంత పార్టీ సీనియర్ల అసహనం
- పదే పదే కాంగ్రెస్ సర్కారును వెనకేసుకురావడంపై విమర్శలు
- మూసీ నుంచి హెచ్‌సీయూ వరకు వివాదాస్పద వైఖరి
- అవసరం లేకున్నా బీఆర్ఎస్‌పై అక్కసు, ఆరోపణలు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తేతెలంగాణ):

- కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాను ప్రవేశ పెట్టి పేదల ఇండ్లను కూలుస్తుంటే బీజేపీ ధర్నాలు చేసింది.. కానీ ఆ పార్టీ ఎంపీ మాత్రం హైడ్రాకు సంపూర్ణ మద్దతు పలికారు.
- రేవంత్ చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును ప్రతి ఒక్కరూ తప్పుబట్టారు. కిషన్ రెడ్డి సహా బీజేపీ నేతలు మూసీ నిద్ర సైతం చేపట్టారు. కానీ అదే పార్టీకి చెందిన ఓ ఎంపీ మాత్రం కూల్చివేతలు సబబేనని కితాబిచ్చారు.
- హెచ్‌సీయూ భూముల విషయంలోనూ అంతే. అందరూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని దుమ్మెత్తి పోస్తుంటే.. ఆ ఎంపీ మాత్రం బీఆర్ఎస్ మీద విమర్శలు చేస్తూ వచ్చారు.

ఎందుకిలా? పదే పదే ప్రభుత్వ పల్లకీని మోయాల్సిన అవసరం ఆ బీజేపీ ఎంపీ కేంది? సర్కారు ఆత్మరక్షణలో పడిన ప్రతీ సారి మీడియా ముందుకు వచ్చి.. ఇష్యూ డైవర్షన్ కోసం ఆరాటపడటమెందుకు? తాజా సంచలన విషయాలనూ చిన్నదిగా కొట్టిపారేస్తూ.. గత ప్రభుత్వంపై పనిగట్టుకొని బురదచల్లేందుకు తాపత్రయమెందుకు? తన పార్టీ వైఖరికి భిన్నమైనా సరే.. కాంగ్రెస్ కోసం సొంత స్టాండ్ ఎందుకు తీసుకుంటున్నట్టు? రేవంత్ సర్కారుకు తనవంతు సాయం అందించేంత బంధమేమిటి? ఇప్పుడు బీజేపీ తోపాటు రాజకీయ పక్షాల్లో ప్రముఖంగా జరుగుతున్న చర్చ ఇది. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించాల్సిందిపోయి.. ప్రధాన ప్రతిపక్షంపై నోరుపారేసుకోవడం సదరు పార్లమెంటు సభ్యుడికి అలవాటుగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డిపై ఈగవాలనీయకుండా ఆయన వ్యవహరిస్తున్న తీరుపై బీజేపీ సీనియర్ నేతలు కొందరు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. తమది ప్రతిపక్ష పార్టీ అని మరిచిపోయినట్టు వ్యవహరించడం, అవసరం లేకున్నా అధికారపక్షానికి అంటకాగడంపై వారు మండిపడుతున్నారు. ఏడాదిన్నర కాలంగా ఎంపీ వ్యవహారశైలి.. ఏ ఏ సందర్భాల్లో ఆయన ఎలా పార్టీ వైఖరికి భిన్నంగా కాంగ్రెస్‌కు మద్దతు నిలిచిన విషయాన్ని వారు ప్రస్తావిస్తున్నారని

బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

### 'కాంగ్రెస్ సర్కారు చేస్తే కరెక్టే'..!

సీఎం రేవంత్ గతేడాది హైడ్రాను ప్రవేశ పెట్టినప్పుడు, మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇండ్లను కూల్చడం మొదలుపెట్టినప్పుడు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. పెద్ద పెద్ద సౌధాలను వదిలి, బడుగుల గుడిసెల మీదికి బుల్డోజర్‌ను తోలడంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బీఆర్ఎస్ మొదటి రోజు నుంచే బాధితుల పక్షాన నిలిచింది. ప్రభుత్వ తీరును అడుగడుగునా తప్పుపడుతూ వచ్చింది. మొదట్లో ఈ బుల్డోజర్ రాజ్‌పై తమకేమీ పట్టనట్టు వ్యవహరించిన బీజేపీ.. ప్రజా వ్యతిరేకతను గమనించి కూల్చివేతలను వ్యతిరేకించడం మొదలుపెట్టింది. 'రాజధాని పరిధిలో ప్రభుత్వం విచ్చలవిడిగా కూల్చివేతలు చేపడుతుంటే.. నలుగురు ఎంపీలు, 40 మంది కార్పొరేటర్లు ఉండీ ఏం లాభం?' అంటూ విమర్శలు వెల్లువెత్తడంతో అనివార్యమైన స్థితిలో బీజేపీ నేతలు బయటకురావాల్సి వచ్చింది. తప్పని సరి పరిస్థితుల్లో ధర్నాలూ చేపట్టారు. 'అవసరమైతే లక్షలమందితో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తాం. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. హైడ్రా విషయంలో హైకోర్టుకు వెళ్తాం' అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రకటనలు సైతం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కూల్చివేతలకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన మొదటి వ్యక్తి సదరు బీజేపీ ఎంపీ! 'నీళ్లల్లో కట్టిన ఇండ్లను కూల్చాల్సిందే. ఆ ఇండ్లకు పర్మిషన్లు ఉన్నా, బ్యాంకులోన్లు ఉన్నా కూల్చివేయాల్సిందే. అలా కూల్చటం చేతకాకపోతే హైడ్రా కమిషనర్ పక్కకు తప్పుకుంటే మంచిది' అని బాహాటంగానే ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా.. కూల్చివేతలకు ఎవరైనా అడ్డొస్తే వారిపైకి బుల్డోజర్లు ఎక్కించాలని, హైడ్రాను జిల్లాలకూ విస్తరించాలని ఆ ఎంపీ సూచించిన విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. చేయాల్సిన నిరసనలు వదిలి.. సదరు ఎంపీ గారి వ్యాఖ్యలపై సర్దిచెప్పుకోవడమే పార్టీకి శిరోభారంగా మారిందని బీజేపీ సీనియర్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

### విషయం ఏదైనా.. బీఆర్ఎస్‌పైకే బాణాలు!

ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోయి.. ఆ పార్లమెంటు సభ్యుడు బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తుండటం మీద రాష్ట్ర బీజేపీలో చర్చ జరుగుతున్నది. దీనికి హెచ్‌సీయూ భూ వ్యవహారమే ఘటనలోనూ ఆయన వైఖరి అనుమానాస్పదంగా ఉన్నదనే దానిపైనా నేతలు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. 400 ఎకరాల్లో అటవీ భూమిని ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. బాధ్యతగల ప్రతిపక్షంగా బీఆర్ఎస్ అడ్డుకున్నది. కంచ గచ్చిబౌలిలో ప్రభుత్వం జరిపిన అరాచకం జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి సమయంలో అధికార కాంగ్రెస్‌ను ప్రశ్నించాల్సిన ఎంపీ.. కేసీఆర్, కేటీఆర్‌పై అసంబద్ధ ఆరోపణలకు దిగడంపై బీజేపీ వర్గాలు అసహసనం వ్యక్తంచేస్తున్నాయి. నిత్యం గత ప్రభుత్వంపైనే ఆరోపణలు చేయడంలో అంతర్ధమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌ను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదనే భావన ప్రజల్లో బలపడుతున్నదని వాపోతున్నారు. ఆయన ధోరణి పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# కేంద్రం.. ఎందుకీ మౌనం!

**కుమ్మక్కయ్యారా? విచారణ చేస్తారా?**

- కంచ భూముల్లో కాంగ్రెస్ విధ్వంసాన్ని కేంద్రం ఆపాలి
- రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలపై విచారణ చేయాలి
- లేదంటే రెండు పార్టీలు కుమ్మక్కైనట్టే భావిస్తం
- ప్రధాని మోదీకి మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్
- 'హెరాల్డ్'పై రేవంత్ మౌనం వెనుక మర్మమేంటని ప్రశ్న

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలి భూముల అమ్మకం ముసుగులో రేవంత్ సర్కారు సాగిస్తున్న ఆర్థిక అక్రమాలపై విచారణకు ఆదేశించాలని ప్రధాని మోదీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణపై ప్రధానిగా తన బాధ్యతలపై చిత్తశుద్ధి ఉంటే మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపాలని శుక్రవారం ఎక్స్ వేదికగా కోరారు. వెంటనే హెచ్‌సీయూ భూముల్లో విధ్వంసాన్ని ఆపివేయించి కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు కాలేదనే విషయాన్ని నిరూపించుకోవాలని సూచించారు. వందల ఎకరాల అమ్మకం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణ విధ్వసంతో పాటు రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసానికి తెరలేపిందని విమర్శించారు. ఆధారాలతో సీవీసీ, సీబీఐ, సీఎఫ్ఐవో, ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశామని వెల్లడించారు. సుప్రీంకోర్టు పంపిన సాధికార కమిటీ సైతం రేవంత్ ప్రభుత్వ అక్రమాలను నిర్ధారించిందని పేర్కొన్నారు. స్వతంత్ర సంస్థలతో విచారణ చేయించాలని సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. నగరాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో నిస్సిగ్గుగా, అక్రమంగా వ్యవస్థలను మోసం చేస్తూ పర్యావరణ, ఆర్థిక విధ్వంసం సాగిస్తున్న రేవంత్ రెడ్డి లాంటి నాయకులను ప్రజల ఎదుట నిలబెట్టాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు.

**కేసీఆర్ పాలనలో తెలంగాణ సంస్కృతి పునరుద్ధరణ**

ఒక ప్రాంతం ఆత్మ.. చరిత్ర, సంస్కృతి, వారసత్వంలో ప్రతిబింబిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. దీన్ని గుర్తించే కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ వారసత్వ సంస్కృతి పరిరక్షణకు నడుం బిగించిందని గుర్తుచేశారు. ఏప్రిల్ 18న వరల్డ్ హెరిటేజ్ డేను పురస్కరించుకొని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో మన రాష్ట్ర చారిత్రక చిహ్నాలు, వారసత్వ సంపదను పునరుద్ధరించి తెలంగాణ సాంస్కృతిక గౌరవాన్ని కాపాడినట్టు వెల్లడించారు.

**'నేషనల్ హెరాల్డ్'పై రేవంత్ మౌనమేల?**

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసిన ఆంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనం వెనుక మర్మమేంటి? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నా సీఎం స్పందించక పోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. దీని వెనుక ఆయనకు వేరే ఆలోచన లేమైనా ఉన్నాయా? అని అనుమానం వ్యక్తంచేశారు.

- తన పరిధిలోని హెచ్‌సీయూలో కాంగ్రెస్ సర్కారు దమనకాండ
- 20 రోజులు అరాచకం జరిగినా కిమ్మనని మోదీ సర్కారు
- అటవీ, వన్యప్రాణి, ఆర్థిక ఉల్లంఘనలకు పాల్పడినా సైలెంట్
- సాక్షాత్తూ సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించినా గప్‌చుప్
- ఇంప్లీడ్ అవ్వాల్సిన చోట నిమ్మకు నీరెత్తినట్టు బీజేపీ సర్కారు
- చిన్న కేసుల్లో వాయువేగంతో స్పందిస్తున్న ఈడీ, సీబీఐ
- బెంగళూరులో కుక్క, తమిళ నాడులో ఇసుక కేసులపై అమితాసక్తి
- ఆర్థిక దోపిడీ యత్నాలు జరిగాయని సీఈసీ చెప్పినా 'నో' యాక్షన్

> పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో రాష్ట్ర ప్రభుత్వం పెను విధ్వంసం సృష్టించినా, సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించినా కేంద్రంలోని బీజేపీ సర్కారు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. తమ పరిధిలోని ఈ కేసులో కనీసం ఇంప్లీడ్ కూడా ఎందుకు కావడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఆర్థిక దోపిడీ యత్నాలు జరిగాయంటూ సాక్షాత్తూ కేంద్ర సాధికార కమిటీ సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో కుండబద్దలు కొట్టినా.. ఈడీ, సీబీఐ ఎందుకు ఇటువైపు రావడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. హెచ్‌సీయూ భూముల్లో అర్ధరాత్రి బుల్డోజర్లు పంపి కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమాగం చేసిందంటూ ఇటీవల ఒక సభలో వ్యాఖ్యానించిన ప్రధాని మోదీ.. హెచ్‌సీయూలో విధ్వంసానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఎందుకు చర్యలకు ఉపక్రమించడం లేదన్నది ఆసక్తికరంగా మారింది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ఎన్నెన్నో విమర్శలు వచ్చినా, కేంద్ర ప్రభుత్వం కానీ, కేంద్ర విద్యా శాఖ కానీ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. చిన్నచిన్న కేసుల విషయంలోనూ ఆగమేఘాలపై ఊడిపడే ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర ఏజెన్సీలు ఆర్థిక, పర్యావరణ అంశాలకు సంబంధించిన ఇంత పెద్ద వ్యవహారంపై దృష్టిసారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కంచ గచ్చిబౌలి వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ఉల్లంఘనలకు పాల్పడిందనే ఆరోపణలున్నాయి. భారత అటవీచట్టం-1927లోని నిబంధనలకు విరుద్ధంగా డీమ్డ్ ఫారెస్ట్ ల్యాండ్‌ను తనఖా పెట్టడం, టీజీఐఐసీకి హక్కులు రాకుండానే ప్రైవేటు సంస్థకు ఈ భూమిని తాకట్టు పెట్టడం, తహసీల్దార్ ప్రమేయం లేకుండానే హక్కుల బదలాయింపు చేపట్టడం వంటి ఆరోపణలున్నాయి. భూముల బదలాయింపులో దాదాపు ఆరేడు విధానపరమైన ప్రధాన ఉల్లంఘనలకు పాల్పడినట్టు విమర్శలొస్తున్నాయి. అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణకు సంబంధించి 1996 డిసెంబర్ 12న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించి వంద ఎకరాల్లో చెట్లను నరికేశారు. 1974, 1981, 2006 పర్యావరణ చట్టాల ఉల్లంఘన జరిగింది. 100 ఎకరాల భూముల్లో విధ్వంసాన్ని కొనసాగించిన ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కింది. విలువైన హెచ్‌సీయూ భూములను ముక్కలు చేసి తద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు చాలా ప్రయత్నాలు జరిగాయంటూ సిద్ధాంత దాస్ నేతృత్వంలోని కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) తన నివేదికలో పేర్కొన్నది. హెచ్‌సీయూ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అటవీ, వన్యప్రాణి, పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కడమే కాకుండా అర్థిక అక్రమాలకూ యత్నించిందనే ఆరోపణలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఈడీ, సీబీఐ, ఐటీ, విజిలెన్స్, ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, క్లైమేట్‌చేంజ్ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు పూనుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**కుక్క కేసు మీద ఉన్న శ్రద్ధ కూడా లేదు**

2023లో మేడిగడ్డ బరాజ్‌లోని ఒక పిల్లర్ కుంగిపోతే, 24 గంటలు గడువక ముందే ఢిల్లీ నుంచి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీ వచ్చి హడావుడి చేసింది. కాళేశ్వరమే నిరుపయోగమని గగ్గోలు పెట్టింది. తమిళనాడులో ఇసుక అక్రమ రవాణా ఘటనలు పెరిగిపోయాయంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నుంచి మూడు ప్రత్యేక బృందాలు ఆ రాష్ట్రంలో గత ఏడాది రెండు, మూడు నెలలపాటు మకాం పెట్టాయి. అక్రమార్కులను పట్టుకోవడానికంటూ ఐఐటీ-కాన్పూర్ పరిశోధకుల సాయంతో టెక్నికల్ స్టడీని నిర్వహించాయి. సూరత్‌లో ఒక నగల వ్యాపారి రూ.10 లక్షల విలువైన జ్యువెల్లరీని ఎగుమతి చేస్తే, డాక్యుమెంట్లలో ఏదో పొరపాటు ఉన్నదని ఈడీ అధికారులు వారంపాటు విచారణ చేపట్టారు. బెంగళూరుకు చెందిన ఒక వ్యక్తి అమెరికా నుంచి రూ.50 కోట్ల విలువైన ఊల్ఫ్ జాతి కుక్కను కొనుగోలు చేశాడని యూట్యూబ్ వీడియోల ద్వారా తెలుసుకొన్న ఈడీ అధికారులు వెంటనే సదరు వ్యక్తి ఇంటికి వెళ్లారు. అయితే, ఆ కుక్క ఊల్ఫ్ జాతిది కాదని, దాని విలువ రూ.లక్ష కూడా చేయదని ఈడీ తేల్చింది. యూపీలోని లక్నో రైల్వేస్టేషన్‌లో ఓ క్లర్క్ రూ.5 వేలను లంచంగా తీసుకోవడం, చెన్నైలోని పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఓ ఉద్యోగి పార్సిల్‌ను ఇవ్వడానికి రూ.10 వేలను లంచంగా డిమాండ్ చేసిన కేసులను సీబీఐ దర్యాప్తు చేసింది. రాష్ట్ర పరిధిలోని ఏసీబీ అధికారులు చేధించాల్సిన ఈ కేసుల్లో సీబీఐ అధికారులు జోక్యం చేసుకోవడంపై విమర్శలొచ్చాయి.

**కోర్టులు స్వయంగా కదిలొచ్చినా..**

హెచ్‌సీయూ భూముల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారించింది. వాస్తవ పరిస్థితిని తెలియజేయాలంటూ సిద్ధాంత దాస్ నేతృత్వంలోని కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ)ని నియమించింది. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన సీఈసీ.. హెచ్‌సీయూ భూములు అత్యంత విలువైనవని, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు ఆనుకొని ఉన్న ఈ భూములను ముక్కలు చేసి తద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు చాలా ప్రయత్నాలు జరిగాయని సుప్రీంకోర్టుకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నది. టీజీఐఐసీ ద్వారా తాకట్టు, వేలం తదితర ప్రక్రియలతో హెచ్‌సీయూ భూములు వ్యాపార, ఆర్థిక దోపిడీకి గురవుతున్నాయని, దీనిపై స్టే ఇవ్వాలని కోర్టును కోరింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చి, పర్యావరణ విధ్వంసానికి పాల్పడ్డారని, చట్టాలను ఉల్లంఘించారని సుమోటోగా తీసుకొని విచారించగా, తమ పరిధిలోని హెచ్‌సీయూ కేసులో ఇంప్లీడ్ అవ్వాలన్న కనీస విజ్ఞత కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడంపై న్యాయనిపుణులు మండిపడుతున్నారు. తమ పరిధిలోని హెచ్‌సీయూలో జరిగిన విధ్వంసంపై మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్, ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర మంత్రులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. అలీగఢ్, జేఎన్‌యూ వర్సిటీల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకొన్నప్పుడు క్షణాల్లో కేంద్ర బలగాలను దింపే కేంద్ర సర్కారు.. హెచ్‌సీయూలోని అటవీ భూముల రక్షణ విషయంలో ఎందుకు శ్రద్ధచూపడం లేదని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు.

**స్థానిక బీజేపీ ఆగమాగం**

హెచ్‌సీయూలో ఇంత తతంగం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై రాష్ట్ర బీజేపీ నేతలు సైతం విస్మయం వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది. 'జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో కొట్లాడుతున్నాం అని చెప్పుకొంటున్న మనం.. హెచ్‌సీయూ విషయంలో ఈ అనుచితమైన ఆలస్యం, అనుచితమైన ఉపేక్ష, అనుచితమైన ఔదార్యం చూయించాల్సిన అవసరమేంటి? కారణమేంటి? రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు విషయంలో కేంద్ర బీజేపీ వ్యవహరిస్తున్న ఈ తీరు రాష్ట్రంలో బీజేపీని మరింత బలహీనం చేస్తున్నది' అనే ఆందోళన బీజేపీ రాష్ట్ర నేతల్లో వ్యక్తమవుతున్నది.

**మోదీ స్టేట్‌మెంట్‌పై గ్రోక్ స్పందన!**

హెచ్‌సీయూ వివాదంపై ప్రధాని మోదీ ఇటీవల ప్రసంగిస్తూ.. అడవుల్లో బుల్డోజర్లను దింపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిజీగా ఉన్నదని దుయ్యబట్టారు. దీంతో మోదీ వ్యాఖ్యలను ఉంటంకిస్తూ, 'హెచ్‌సీయూ విషయంలో మోదీ నిజంగానే ఆందోళనతో ఉన్నారా?' అంటూ ఓ నెటిజన్ ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'ను ప్రశ్నించాడు. దీనిపై గ్రోక్ స్పందిస్తూ.. హెచ్‌సీయూలోని అడవిని రేవంత్ ప్రభుత్వం నాశనం చేస్తున్నదంటూ మోదీ చేసిన వ్యాఖ్యలు సరైనవేనని పేర్కొన్నది. అయితే, మోదీ హయాంలో పర్యావరణ పరిరక్షణ చట్టాలు నిర్వీర్యమైన విధానాన్ని గ్రోక్ ప్రస్తావించింది. అభివృద్ధి పేరిట అండమాన్ నికోబార్ దీవులు, హిమాలయ ప్రాంతాల్లో అడవులను మోదీ ప్రభుత్వం నాశనం చేసిందని వివరించింది. హెచ్‌సీయూ వివాదంలో ఒకవైపు చెట్లను రక్షించాలని మోదీ చెప్పారనే.. మరోవైపు పర్యావరణ విధ్వంసానికి పాల్పడ్డారని మండిపడింది. దీనినిబట్టి మోదీ తాజా వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసం చేసినవేనని గ్రోక్ తేల్చి చెప్పింది.

**రూ.800 కోట్ల జరిమానా**

చెట్లను నరికేయడం మనిషిని చంపడం కంటే పెద్ద నేరమని ఒక కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 454 చెట్లను విచక్షణారహితంగా నరికేసిన ఒక వ్యక్తికి చెట్టుకు రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కంచ గచ్చిబౌలిలోని 100 ఎకరాల్లో దాదాపు 80,000కుపైగా చెట్లను నరికివేసిందనే ఆరోపణలున్నాయి. ఈ లెక్కన సుప్రీంకోర్టు తాజా తీర్పు ప్రకారం.. ఇన్ని చెట్లను నరికినందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.800 కోట్ల జరిమానా చెల్లించాల్సి ఉంటుందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఈ భూముల్లో రాష్ట్ర ప్రభుత్వం సాగించిన దమకాండకు భారత చట్టాల ప్రకారం శిక్షలు వేసుకొంటూపోతే, ఈ విధ్వంసానికి కారణమైన వారికి కనిష్ఠంగా 17.5 ఏండ్ల నుంచి గరిష్ఠంగా 40.5 ఏండ్ల జైలుశిక్ష విధించాల్సి ఉంటుందని పర్యావరణ, న్యాయ నిపుణులు చెప్తున్నారు.

### కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఉల్లంఘనలు- శిక్షలు

**ఉల్లంఘన-1:** భారత అటవీ చట్టం-1927 నిబంధనలను తుంగలోతొక్కి డీమ్డ్ ఫారెస్ట్ ల్యాండ్‌ను ప్రభుత్వం తనఖాకు పెట్టింది.
**శిక్ష:** ఆరు నెలల జైలుశిక్ష, అటవీ భూమిలో జరిగిన నష్టాన్ని భర్తీ చేయడం.

**ఉల్లంఘన-2:** టీజీఐఐసీకి హక్కులు రాకుండానే ప్రైవేటు సంస్థకు భూమిని తాకట్టు పెట్టింది. తహసీల్దార్ ప్రమేయం లేకుండానే హక్కుల బదలాయింపు చేపట్టారు. భూముల బదలాయింపులో దాదాపు ఆరేడు విధానపరమైన ప్రధాన ఉల్లంఘనలు చోటుచేసుకొన్నాయి.
**శిక్ష:** కనిష్ఠంగా రెండేండ్లు, గరిష్ఠంగా 14 ఏండ్ల జైలు శిక్ష.

**ఉల్లంఘన-3:** అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణకు సంబంధించి 1996 డిసెంబర్ 12న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి చెట్లను నరికేశారు. 1972, 1974, 1981, 2006 వన్యప్రాణి, పర్యావరణ చట్టాల ఉల్లంఘన జరిగింది.
**శిక్ష:** ఏడేండ్ల జైలు శిక్ష.

**ఉల్లంఘన-4:** వాల్టా చట్టంలోని సెక్షన్ 28(5) ప్రకారం ఒక చెట్టును నరికితే, అక్కడ లేదా పరిసరాల్లో కనీసం రెండు మొక్కలు నాటాలి. అలా కుదరనప్పుడు వాటి నిర్వహణ ఖర్చులు భరించాలి. 100 ఎకరాల భూముల్లో విధ్వంసాన్ని కొనసాగించిన రేవంత్ ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కింది.
**శిక్ష:** గరిష్ఠంగా ఐదేండ్ల జైలు శిక్ష.

**ఉల్లంఘన-5:** హెచ్‌సీయూ భూముల్లో విధ్వంసంతో జాతీయ పక్షి నెమలి ఆవాసాన్ని ధ్వంసం చేసి, తద్వారా తన జీవనానికి ప్రమాదం కల్పించేలా చేశారు.
**శిక్ష:** ఏడాది నుంచి ఏడేండ్ల జైలు శిక్ష.

**ఉల్లంఘన — 6:** జింకల మరణానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కారణమయ్యారు.
**శిక్ష:** రెండేండ్ల నుంచి ఏడేండ్ల జైలు.

### హెచ్‌సీయూలో విధ్వంసం ఇలా..

| | |
|---|---|
| హెచ్‌సీయూలో చెట్లు నరికిన ప్రాంతం | 100 ఎకరాలు |
| మొత్తం నేలకొరిగిన చెట్లు | 80,000 (అంచనా) |
| ఇటీవల ఒక కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం జరిమానా | రూ.800 కోట్లు |
| పర్యావరణ ఉల్లంఘనలు, వన్యప్రాణుల హింసకు పడే జైలు శిక్ష | గరిష్ఠంగా 40 ఏండ్లు |
| విధ్వంసంతో ఆవాసాలు కోల్పోయిన జీవ, పక్షి జాతులు | 225 |

# ఆ భూములు హెచ్‌సీయూవే.. అదంతా అడవే

- 'కంచ అస్తాబల్ పోరంబోకు సర్కారీ'గా రికార్డుల్లో నమోదు
- ఆధారాలతోసహా బయటపెట్టిన సీఈసీ : స్టూడెంట్ యూనియన్
- సెంట్రల్ కమిటీ నివేదికలోని ప్రధాన అంశాలతో పోస్టర్ల విడుదల

*విద్యార్థులు విడుదల చేసిన పోస్టర్లు*

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం చెట్లను నరికేసిన 400 ఎకరాల భూములు న్యాయబద్ధంగా హెదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకే చెందుతాయని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ నివేదికలో తేల్చిందని స్టూడెంట్ యూనియన్ వెల్లడించింది. ఆ భూముల్లో జరిగిన విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్టు సుప్రీం కోర్టుకు నివేదించిందని స్టూడెంట్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం కేంద్ర సాధికార కమిటీ నివేదికలోని ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ పోస్టర్లు విడుదల చేశారు. చారిత్రక రికార్డులు, న్యాయపరమైన ఆధారాల ప్రకారం 400 ఎకరాలతోపాటు హెచ్‌సీయూ పరిధిలో ఉన్న భూములన్నీ వర్సిటీకే చెందుతాయని సీఈసీ ఆధారాలతో సహా తేల్చిందని విద్యార్థులు పేర్కొన్నారు. ఆ భూములపై హక్కులను టీజీఐఐసీకి బదాలయించడంలో లోపాలను ఎత్తిచూపిందని తెలిపారు. కంచ గచ్చిబౌలిలోని 2,300 ఎకరాల భూమి రికార్డుల ప్రకారం యూనివర్సిటీకే చెందుతుందని, అప్పటి రికార్డుల్లో 'కంచ అస్తాబల్ పోరంబోకు సర్కారీ'గా నమోదు చేసినట్టు తెలిపారు.

# రేవంత్‌ను కాపాడాల్సిన అవసరం లేదు

**బ